అటు రబడ.. ఇటు రాహుల్

రబడ (5/44)

కేఎల్ అజేయ హాఫ్‌సెంచరీ

కగిసోకు ఐదు వికెట్లు

దక్షిణాఫ్రికాతో బాక్సింగ్‌డే టెస్టు

భారత్ తొలి ఇన్నింగ్స్ 208/8

రాహుల్ (70*)

సఫారీ సవాల్ తొలిరోజు సమంగా నిలిచింది. ఇటు కేఎల్ రాహుల్ మొక్కవోని దీక్షతో అర్ధశతకం సాధించి అజేయంగా నిలిస్తే.. అటు కగిసో రబడ ఐదు వికెట్లతో అదరగొట్టాడు. టాపార్డర్ విఫలం కాగా.. కోహ్లీ, శ్రేయస్ కాస్త పోరాడారు. వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్ మరో సెషన్ మిగిలుండగానే వరుణుడి వల్ల ఆగిపోయింది. సీమ్‌కు సహకరిస్తున్న పరిస్థితుల్లో దక్షిణాఫ్రికా పేసర్లు రెచ్చిపోయినా.. కీలక పరుగులు చేసిన టీమ్‌ఇండియా కూడా పోటీలోనే నిలిచింది. బుధవారం కూడా మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉండగా.. తొలి ఇన్నింగ్స్‌లో మనవాళ్లు ఇంకెన్ని పరుగులు చేస్తారనేది ఆసక్తికరం!

సెంచూరియన్: దక్షిణాఫ్రికా గడ్డపై తొలి సారి టెస్టు సిరీస్ గెలువాలనే పట్టుదలతో బరిలోకి దిగిన భారత జట్టు.. మొదటి రోజు పర్వాలేదనిపించింది. వర్షం ఆటంకం మధ్య ప్రారంభమైన బాక్సింగ్‌డే టెస్టులో.. పిచ్ పేసర్లకు సహకరిస్తున్న చోట మనవాళ్లు గొప్ప పోరాట పటిమ కనబర్చారు. ఫలితంగా మంగళవారం ఆట నిలిచే సమయానికి టీమ్ ఇండియా 59 ఓవర్లలో 8 వికెట్లకు 208 పరుగులు చేసింది. వెలుతురులేమి, వర్షం కారణంగా మ్యాచ్ ముందుగానే ముగిసింది. వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (105 బంతుల్లో 70 బ్యాటింగ్; 10 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ అర్ధశతకంతో రాణించగా.. మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ (38), శ్రేయస్ అయ్యర్ (31), శార్దూల్ ఠాకూర్ (24) తలా కొన్ని పరుగులు చేశారు. కెప్టెన్ రోహిత్ శర్మ (5), యశస్వి జైస్వాల్ (17), శుభ్‌మన్ గిల్ (2), రవిచంద్రన్ అశ్విన్ (8) విఫలమయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఏస్ పేసర్ రబడ 5 వికెట్లు పడగొట్టగా.. బర్గర్ 2 వికెట్లు తీశాడు. ప్రస్తుతం రాహుల్‌తో పాటు హైదరాబాదీ మహమ్మద్ సిరాజ్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఈ మ్యాచ్ ద్వారా ప్రసిద్ధ్ కృష్ణ టెస్టు అరంగేట్రం చేయగా.. రవీంద్ర జడేజా అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండటంతో ఏకైక స్పిన్నర్‌గా అశ్విన్‌కు జట్టులో చోటు దక్కింది. ఒక దశలో 24 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ జట్టును శ్రేయస్‌తో కలిసి కోహ్లీ ఆదుకోగా.. రెండో సెషన్ ఆరంభంలో రబడ రెచ్చిపోవడంతో భారత్ స్వల్ప వ్యవధిలో మరో మూడు వికెట్లు కోల్పోయింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో శార్దూల్ ఠాకూర్ అండతో పోరాడిన రాహుల్ జట్టు స్కోరు రెండొందలు దాటించాడు. బుధవారం కూడా మ్యాచ్‌కు వర్షం అడ్డుపడే అవకాశం ఉండటంతో.. తొలి ఇన్నింగ్స్‌లో మన వాళ్లు మరెన్ని పరుగులు జోడిస్తారో చూడాలి.

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 208/8 (రాహుల్ 70 నాటౌట్, కోహ్లీ 38; రబడ 5/44, బర్గర్ 2/50).

తడబ్యాటులోనూ.. తళుక్కు!

మూడు దశాబ్దాలుగా దక్షిణాఫ్రికా పర్యటనలో భారత జట్టు టెస్టు సిరీస్ ఎందుకు గెలువలేకపోయింది. తొలి రోజు ఆట చూసిన వాళ్లకు అవగతమయ్యే ఉంటుంది. సాధారణంగానే పేస్‌కు అనుకూలించే సెంచూరియన్ పిచ్‌కు వరుణుడు తోడవగా.. రోహిత్ శర్మ టాస్ ఓడిపోయాడు. ఇంకేముంది తమకు అనుకూలించే పరిస్థితుల్లో సఫారీ పేసర్లు రెచ్చిపోయారు. అనూహ్య బౌన్స్, అదనపు స్వింగ్‌కు వారి వాయు వేగం తోడవడంతో భారత జట్టు వరుసగా వికెట్లు కోల్పోయింది. ఐదో ఓవర్ చివరి బంతికి రోహిత్ తనకిష్టమైన పుల్‌షాట్ ఆడే క్రమంలో క్యాచ్ ఔట్ కాగా.. కాసేపటికే మరో ఓపెనర్ జైస్వాల్ అతడిని అనుసరించాడు. గిల్ ఇలా వచ్చి అలా వెళ్లాడు. ఈ దశలో మరో వికెట్ పడి ఉంటే.. టీమ్‌ఇండియా కోలుకోవడం కష్టమయ్యేదే. కానీ, క్లిష్ట పరిస్థితుల్లో కోహ్లీ అడ్డు నిలిచాడు. పుజారా, రహానే లేని లోటును పూరిస్తూ.. మొదట కాస్త ఆచితూచి ఆడిన ఆ తర్వాత సాధికారిక బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతడికి శ్రేయస్ నుంచి మంచి సహకారం లభించింది. ఇక కోలుకున్నట్లే అనుకుంటున్న దశలో రెండో సెషన్ ఆరంభంలో రబడ రెచ్చిపోయాడు. అయ్యర్‌ను క్లీన్ బౌల్డ్ చేసిన సఫారీ పేసర్.. కోహ్లీని ఒక అద్భుత బంతితో బోల్తా కొట్టించాడు. అశ్విన్ ఎక్కువసేపు నిలువలేకపోయాడు. దీంతో భారత్ 121/6తో నిలిచింది. టెస్టు కెరీర్‌లో తొలి సారి వికెట్ కీపింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న రాహుల్.. మిడిలార్డర్‌లో తన విలువ చాటుకున్నాడు. మంచి బంతులను గౌరవించిన రాహుల్.. చెత్త బంతి దొరికితే దానిపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు. అతడు చేసిన 70 పరుగుల్లో 52 రన్స్ బౌండ్రీల ద్వారానే వచ్చాయంటే అతడు ఎంత పర్ఫెక్ట్ షాట్‌లు ఆడాడో అర్థం చేసుకోవచ్చు. గత సఫారీ పర్యటన బాక్సింగ్ డే టెస్టులో సెంచరీతో ఆకట్టుకున్న రాహుల్.. ఈ సారి అంతకుమించిన విలువైన ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు.

-నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

పోలీస్ రేసుగుర్రాలు..

హైదరాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో 42వ జాతీయ పోలీస్ గుర్రపు స్వారీ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సర్దార్ పటేల్ పోలీసు అకాడమీ డైరెక్టర్ జనరల్ అనురాగ్ గార్గ్ పోటీలను ప్రారంభించారు. జనవరి 5వ తేదీ వరకు చాంపియన్ షిప్ కొనసాగనున్నది. ఇందులో 610 మంది జాకీలు పాల్గొంటున్నారు. వివిధ రాష్ట్ర పోలీసు బలగాలు, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీ మరియు సెంట్రల్ పోలీస్ ఆర్గనైజేషన్స్) నుంచి 340 గుర్రాలు పోటీల్లో ఉన్నాయి. 1970వ సంవత్సరం నుంచి ప్రతి ఏటా ఆల్ ఇండియా పోలీస్ హార్స్ షో పోటీలను నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లో ఈ పోటీలు జరగడం ఇది 16వ సారి కావడం విశేషం. మంగళవారం 30 గుర్రాలు పోటీలో పాల్గొన్నాయి. జనవరి 5న ముగింపు వేడుక నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

వినేశ్ అవార్డులు వాపస్

ఖేల్‌రత్న, అర్జున పురస్కారాలు వెనుకకు

బజరంగ్, వీరేందర్‌సింగ్ బాటలో వినేశ్ ● అధ్యక్ష ఎన్నికపై కొనసాగుతున్న వ్యతిరేకత

న్యూఢిల్లీ: భారత కుస్తీవీరుల అవార్డుల వాపసీ పరంపర కొనసాగుతున్నది. జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్(డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్ష ఎన్నికపై రగడ మలుపులు తిరుగుతూనే ఉన్నది. బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ సన్నిహితుడైన సంజయ్‌సింగ్ ఎన్నిక కావడాన్ని నిరసిస్తూ ఇప్పటికే సాక్షి మాలిక్ తన కెరీర్‌కు వీడ్కోలు పలుకగా, బజరంగ్ పునియా, వీరేందర్‌సింగ్ బాటలో స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్ పయనించింది. ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో పతకాలు సాధించనందుకు తాను అందుకున్న ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుతో పాటు అర్జున వాపస్ ఇస్తున్నట్లు మంగళవారం ప్రకటించింది. మహిళా రెజ్లర్లకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా తన అవార్డులను కేంద్ర ప్రభుత్వానికి వెనుకకు ఇస్తున్నట్లు పేర్కొంది. దేశంలో మహిళా రెజ్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధాని నరేంద్రమోదీకి వినేశ్..ఎక్స్‌లో లేఖను పోస్ట్ చేసింది. 'ఖేల్‌రత్న, అర్జున అవార్డులకు ప్రస్తుతం నా జీవితంలో సరైన విలువలేవు. దేశంలో ప్రతీ మహిళా గౌరవంగా బతకాలని అనుకుంటున్నది. అందుకే బరువు తొలిగించుకునేందుకు ఈ అవార్డులు వాపస్ ఇస్తున్నాం పీఎం సార్. 2016 రియో ఒలింపిక్స్‌లో సాక్షి మాలిక్ పతకం గెలిచినప్పుడు మీరు 'బేటీ బచావో..బేటీ పడావో'కు ఆమెను ప్రచారకర్తగా ప్రకటించారు. అప్పుడు సాటి మహిళలుగా అందరం గర్వపడ్డాం. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో సాక్షి కెరీర్‌కు వీడ్కోలు పలుకడం చాలా బాధగా ఉంది. మేము ప్రభుత్వ పథకాలకు ప్రచారకర్తలుగా మాత్రమే పనికొస్తామా? మీ ప్రభుత్వం మహిళా సాధికారత పట్ల సీరియస్‌గా ఉంటే మా సమస్యలపై దృష్టి పెట్టండి' అని రాసుకొచ్చింది. సంజయ్ సింగ్ ఎన్నికను రద్దు చేస్తున్నట్లు ఇటీవలే క్రీడాశాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే.

రంజీ కెప్టెన్‌గా తిలక్‌వర్మ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రానున్న దేశవాళీ సీజన్ రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టుకు యువ క్రికెటర్ తిలక్‌వర్మ నాయకత్వం వహించబోతున్నాడు. నాగాలాండ్, మేఘాలయతో జరిగే తొలి రెండు మ్యాచ్‌ల్లో తిలక్ సారథ్యంలో హైదరాబాద్ బరిలోకి దిగనుంది. రంజీ ట్రోఫీ కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) మంగళవారం 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది.

ఆస్ట్రేలియా 187/3

మెల్‌బోర్న్: టాపార్డర్ తలా కొన్ని పరుగులు చేయడంతో పాకిస్థాన్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా ఓ మాదిరి స్కోరు చేసింది. తొలిరోజు మంగళవారం వర్షం కారణంగా ఆట నిలిచిపోయే సమయానికి ఆసీస్ 3 వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేసింది. వార్నర్ (38), ఉస్మాన్ ఖవాజా (42), లబుషేన్ (44 నాటౌట్), స్టీవ్ స్మిత్ (26) రాణించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.